ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, ఫిబ్రవరి 26:వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్లు నియోజకవర్గ ఆర్వో, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. బుధవారం పట్టణ శివారులోని ఆర్జాలబావి పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి ఆమె సందర్శించారు. అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనున్నట్లు చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక మైక్రో అబ్జర్వర్‌తో పాటు సెక్టోరియల్ ఆఫీసర్ చొప్పున మొత్తం 752 మంది సిబ్బంది పోలింగ్ విధుల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స, నీటి సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో మొత్తం 19 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. ఓటర్లు ఎన్నికల సంఘం గుర్తించిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒక దానిని వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో 37 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో ఐదు సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. 13 రూట్లు ఏర్పాటు చేసి పోలింగ్ లొకేషన్లల్లో స్ట్రైకింగ్ ఫోర్స్‌తో పాటు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటు చేసి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చూస్తున్నట్లు చెప్పారు. ఇతర జిల్లాల పోలీసు అధికారుల సమన్వయంతో ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద సెంట్రల్ ఫోర్స్‌తో పాటు ఏఆర్ పోలీసులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వారి వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ, డీఆర్వో అశోక్‌రెడ్డి, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్ ఉన్నారు.

ఎన్నికల సామగ్రిని తీసుకెళ్లే బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ నుంచి పోలింగ్ కేంద్రాలకు సామగ్రి తీసుకెళ్తున్న సిబ్బంది

మండలాల్లో ఏర్పాటు పూర్తి

కొండమల్లేపల్లి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తాసీల్దార్ అన్వర్ హుస్సేన్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 193వ పోలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లుడుతూ పట్టణంలో పోలింగ్ కేంద్రంలో మొత్తం 84 మంది ఉపాధ్యాయులు ఓటుహక్కు వినియోగించుకోనున్నట్లు చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. అయన వెంట పోలింగ్ సిబ్బంది ఉన్నారు.

కేతేపల్లి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో మొత్తం 53 మంది ఉపాధ్యాయులు ఓటుహక్కును వినియోగించుకోనున్నట్లు తాసీల్దార్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

పోలింగ్ కేంద్రాలకు చేరిన సామగ్రి

త్రిపురారం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి ఎన్నికల సిబ్బంది, సామగ్రి బుధవారం చేరుకున్నాయి. మండలంలో మొత్తం 77 ఓట్లు ఉన్నాయని , ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించాలని రూట్ ఆఫీసర్, నిడమనూరు తాసీల్దార్ జంగాల కృష్ణయ్య సూచించారు. ఆయన వెంట త్రిపురారం తాసీల్దార్ గాజుల ప్రమీల, ఎస్ఐ వై.ప్రసాద్, ఆర్ఐ గుండెబోయిన సైదులు ఉన్నారు.

మర్రిగూడ : మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ఎన్నికల సిబ్బంది సామగ్రితో పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. తాసీల్దార్ బక్క శ్రీనివాసులు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 67మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. పోలీసు, రెవెన్యూ, ఆరోగ్య, సిబ్బంది పోలింగ్ విధుల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు.

త్రిపురారం జడ్పీహైస్కూల్‌కు చేరుకున్న ఎన్నికల సామగ్రితో పోలింగ్ అధికారులు, పోలీసులు

నిడమనూరు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పోలింగ్ సిబ్బంది

కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది, అధికారులు

జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులు

విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

పెద్దవూర, ఫిబ్రవరి 26: మండంలోని చింతపల్లి గ్రామంలో దున్న ఇద్దాసు జాతర సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో విజేతలకు బుధవారం ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దున్న ఇద్దాసు జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సుంకిరెడ్డి పద్మావతీసంజీవరెడ్డి, నడ్డి లింగయ్యయాదవ్, నాయకులు షేక్ అబ్బాస్, వికారాబాద్ సీఐ ఆర్కెపల్లి ఆంజనేయులు, దున్న సురేశ్, సత్యనారాయణయాదవ్ పాల్గొన్నారు.

లాంచీల్లో ఏలేశ్వరం గట్టుకు

ఏలేశ్వరం గుట్టకు లాంచీలో వెళ్తున్న భక్తులు

నందికొండ, ఫిబ్రవరి 26 : కృష్ణానది మధ్యలో ఉన్న ఏలేశ్వరం గుట్టకు బుధవారం రాష్ట్ర పర్యాటక సంస్థ నాగార్జునసాగర్ హిల్ కాలనీ లాంచీ స్టేషన్ నుంచి ప్రత్యేక లాంచీలను నడిపించింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏలేశ్వర గుట్టపై ఉన్న కాత్యాయనీ సమేత ఏలేశ్వర స్వామి ఆలయాలకు తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. సుమారు కిలో మీటర్ దూరంలో నిటారుగా అత్యంత్య ఎత్తులో ఉన్న గుట్టపైకి కాలినడకన వెళ్లిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పోలీసులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు.

భీమానాయక్ సేవలు చిరస్మరణీయం

● ఎమ్మెల్యే బాలునాయక్

భీమానాయక్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

చందంపేట(దేవరకొండ), ఫిబ్రవరి 26 : బంజారా సేవా సంఘం నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు రమావత్ భీమానాయక్ సేవలు చిరస్మరణీయమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని బంజారా భవన్‌లో నిర్వహించిన భీమానాయక్ 8వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భీమానాయక్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారా సంఘం బలోపేతానికి, బంజారా భవన నిర్మాణంలో ఆయన కృషిని కొనియాడారు. అనంతరం దేవరకొండ పట్టణంలోని శివాలయంలో పూజలు నిర్వహించారు. చందంపేటలోని మగ్దూం షావలీ బాబా దర్గాను ఎమ్మెల్యే దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ మాజీ చైర్మన్లు ఆలంపల్లి నర్సింహ, వడ్త్య దేవేందర్‌నాయక్, మాజీ ఎంపీపీ బిక్కునాయక్, సిరాజ్‌ఖాన్, నాయకులు సుక్కునాయక్, లక్మానాయక్, కిన్నెర హరికృష్ణ, పాపానాయక్, లక్పతినాయక్, ఎంఈఓ చందర్‌నాయక్ పాల్గొన్నారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

నకిరేకల్, ఫిబ్రవరి 26 : వాసవీ కపుల్స్ క్లబ్, వాసవీ క్లబ్ నకిరేకల్ ఆధ్వర్యంలో పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఎండ తీవ్రంగా ఉన్న దృష్ట్యా భక్తులు ఇబ్బందులు పడకుండా మజ్జిగ అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వాసవీ కపుల్స్ క్లబ్ అధ్యక్షుడు తేలుకుంట్ల రాజుశోభారాణి, ఉపాధ్యక్షుడు కందగట్ల బాలాజీ, ప్రధాన కార్యదర్శి శ్రీకాకుళ వెంకన్న, కోశాధికారి బ్రహ్మదేవర వేణు, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ దేవరశెట్టి సత్యనారాయణ, జోన్ చైర్మన్ గుండా నరేందర్ కరుణ, వాసవీ క్లబ్ అధ్యక్షుడు గుడిపాటి రవి పాల్గొన్నారు.

మిర్యాలగూడటౌన్ : వాసవీక్లబ్ గ్రేటర్ మిర్యాలగూడ అధ్యక్షుడు మంచుకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం రైల్వేట్రాక్ వద్ద గల శివాలయంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్‌సర్వీసెస్ సెక్రటరీ లకుమారపు పాండురంగయ్య, ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మిర్యాల శత్రయ్య, రీజియన్ చైర్మన్ వెచ్చ సతీశ్, జోన్ చైర్మన్ రేపాల శ్రీనివాస్, సెక్రటరీ రంగాశ్రీను, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంపచెట్లు పెరిగి అధ్వాన్నంగా మారిన కట్టంగూర్ బస్టాండ్

నిరుపయోగంగా కట్టంగూర్ బస్టాండ్

కట్టంగూర్, ఫిబ్రవరి 26 : ప్రయాణికుల సౌకర్యార్థం మండల కేంద్రంలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. రూ.లక్షలు పెట్టి నిర్మించినప్పటికీ వాటి నిర్వహణను ఆర్టీసీ పట్టించుకోక పోవడంతో అవి ప్రజలకు ఉపయోగ పడడంలేదు. మండల కేంద్రంలో 2001లో రూ. 10 లక్షలతో ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించారు. గ్రామ శివారులో నిర్మించడం, బస్సులు బస్టాండ్‌లోకి రాక పోవడంతో ప్రయాణికులు సైతం అందులోకి వెళ్లడం లేదు. ప్రస్తుతం నిరుపయోగంగా మారడంతో కిటికీలు, బండలు ఇతర సామగ్రి చోరీకి గురయ్యాయి. ప్రాంగణం ఉదయం వలస జీవులకు, జూదరులకు, రాత్రిపూట అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. బస్టాండ్ నిరుపయోగంగా ఉండడంతో ప్రయాణికులు జాతీయ రహదారిపై ఎండ, వానకు తడుస్తూ బస్సుల కోసం ఎదురు చూడాల్సి వస్తున్నది. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

వధువు కావలెను
ఆర్య వైశ్య అబ్బాయి 1989, M.Ed. పార్ట్ టైమ్ లెక్చరర్, వ్యవసాయం, 14x2=28 వేలు, ఆస్థి 70 లక్షలు, నల్లగొండ, వీరయ్య 9121325068, కోమట్ల అమ్మాయి కావలెను 1వ, M9HB, మునుగోడు రోడ్డు.
NLG-

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777630 | చౌటుప్పల్ : 9182777638

పాట్నా ఐఐటీలో బెట్టెతండా విద్యార్థి ఆత్మహత్య

రాహుల్‌నాయక్(ఫైల్)

మిర్యాలగూడ, ఫిబ్రవరి 26: పాట్నా ఐఐటీలో చదువుతున్న దామరచర్ల మండలం బెట్టెతండాకు చెందిన విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం బెట్టెతండాకు చెందిన లావూరి శంకర్, జ్యోతి దంపతులు ఉపాధ్యాయులు. వీరు మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు కాగా చిన్న కుమారుడు లావూరి రాహుల్‌నాయక్ (20) పాట్నా యూనివర్సిటీలో ఐఐటీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. చదువులో వచ్చిన ఇబ్బందుల్లో, మరేదైనా కారణమో కాని మంగళవారం హాస్టల్లో ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి మిర్యాలగూడకు తీసుకొచ్చారు. చదువులో ముందుండే రాహుల్‌నాయక్ మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

'చెరువులు నింపేందుకు కాల్వలు ఏర్పాటు చేయాలి'

మునుగోడు, ఫిబ్రవరి 26 : ఉదయ సముద్రం ప్రాజెక్టు నుంచి మండలంలోని చెరువులు నింపేందుకు ప్రత్యేక కాల్వలు ఏర్పాటు చేయాలని అక్షర ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు కోడి రాములు కోరారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కనీసం చెరువుల్లో నీరు నింపితే భూగర్భ జలాలు పెరిగి రైతుల ఇబ్బందులు తీరుతాయని, తాగునీటి ఎద్దడి ఉండదని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

నిజాయితీ చాటుకున్న కటింగ్‌షాపు యజమాని

అశోక్‌ను సన్మానిస్తున్న వివిధ పార్టీల నాయకులు

చిట్యాల, ఫిబ్రవరి 26 : చిట్యాలకు చెందిన చికలంమెట్ల అశోక్‌కు చెందిన కటింగ్‌షాపునకు వచ్చిన వ్యక్తి మూడున్నర తులాల బంగారు ఆభరణాన్ని అక్కడే వదిలేసి వెళ్లాడు. దీనిని గమనించిన షాపు యజమాని అశోక్ దానిని భద్రపర్చి తిరిగి వినియోగదారుడుకి అందజేసి నిజాయితీ చాటుకున్నాడు. దాంతో అశోక్‌ను బుధవారం వివిధ పార్టీల నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నూనె వెంకటస్వామి, జిట్ట నగేశ్, నారబోయిన శ్రీనివాస్, గ్యార మారయ్య, మెండె మల్లేశ్, జిట్ట శ్రీకాంత్, పాల మహేశ్ పాల్గొన్నారు.

పాము కాటుతో గీత కార్మికుడు మృతి

శంకర్(ఫైల్)

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 26 : పాముకాటుతో గీత కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలోని తొండల్‌వాయి గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తొండల్‌వాయి గ్రామానికి చెందిన దంతూరి శంకర్(30) కల్లుగీస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా చెట్టుపైన ఉన్న పాము కాటు వేసింది. దాంతో భయభ్రాంతులకు గురైన శంకర్ అరుస్తూ కిందికి దిగుతూనే అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. చుట్టుపక్కల వారు వచ్చి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు ఉరుమడ్ల బాలిక

మర్రి కల్పన

చిట్యాల, ఫిబ్రవరి 26 : మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన మర్రి కల్పన జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు నల్లగొండ హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు కూతురు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇమాం కరీం తెలిపారు. ఫిబ్రవరి మొదటి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సెలక్షన్స్‌లో కల్పన ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. కల్పన ఇప్పటి వరకు 24 సార్లు రాష్ట్ర స్థాయి పోటీలకు, 18 సార్లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. కల్పనను అసోసియేషన్ యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల కార్యదర్శులు శ్రీనివాసులు, లింగయ్య అభినందించారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరికి రిమాండ్

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 26 : విలాసాలకు అలవాటు పడి ఒంటరి మహిళలను టార్గెట్ చేస్తూ చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన నల్లమల్ల రఘు కొంతకాలం నుంచి నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో నివాసముంటున్నాడు. చెర్వుగట్టుకు చెందిన బాలుడితో కలిసి ఒంటరిగా ఉన్న మహిళల కళ్లల్లో కారం చల్లి వారి మెడలోనుంచి బంగారు నగలను చోరీ చేస్తున్నాడు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు పోలీసులు వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నెల 25న నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న రఘుతో పాటు బాలుడిని పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారివద్ద నుంచి 15 తులాల బంగారు ఆభరణాలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చివ్వెంల, ఫిబ్రవరి 26: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన ఘటన మండలంలోని ఉండ్రుగొండ శివారులో జాతీయ రహదారి నంబర్‌పై 65పై బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు కారులో విజయవాడకు బయలుదేరారు. ఈ క్రమంలో ఉండ్రుగొండ శివారుకు రాగానే జాతీయ రహదారి వెంట మొక్కలకు నీళ్లు పోస్తున్న ట్యాంకర్ ఒక్కసారిగా కుడివైపునకు టర్న్ తీసుకోవడంతో వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు అమాంతం లేచి పల్టీకొట్టి తిరగబడింది. కారు డ్రైవర్ మక్బూద్, మరో ఇద్దరు రసూల్, రఫీక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో ముగ్గురిని సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు..

కోదాడ రూరల్: బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన దోరకుంట శివారులోని 65వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని దోరకుంటకు చెందిన పిట్టల పాపయ్య తన బంధువుతో కలిసి బైక్‌పై కోదాడకు వస్తుండగా గుర్తు తెలియని కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో పాపయ్యతలకు తీవ్రగాయాలు కాగా అంబులెన్స్‌లో కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

అనారోగ్యం తాళలేక వ్యక్తి ఆత్మహత్య

కేతేపల్లి, ఫిబ్రవరి 26 : అనారోగ్య సమస్యలతో మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లికి చెందిన గుండిగ బాలరాజు(50) కొంత కాలంగా మానసిక, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య జోస్పిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటుల ఎస్ఐ శివతేజ తెలిపారు.

'సేవాలాల్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలి'

మఠంపల్లి, ఫిబ్రవరి 26: హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 28వ తేదీన నిర్వహించే సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతికి గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధరావత్ నవీన్ నాయక్, ఉత్సవ కమిటీ కన్వీనర్, కో కన్వీనర్లు తులసీరామ్ నాయక్, సైదులు నాయక్ కోరారు. ఈ మేరకు బుధవారం మఠంపల్లిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాణోతు భాస్కర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాబునాయక్, రాముడు, వీటినాయక్, పాండునాయక్, ప్రేమ్‌నాయక్, గోవిందు, శ్రీనునాయక్, మాళోతు రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి: 28న హుజూర్‌నగర్‌లో సేవాలాల్ 286వ జయంతిని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధరావత్ నవీన్ నాయక్ తెలిపారు. బుధవారం కీతవారిగూడెంలో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు.

ప్రమాదకరంగా రోడ్డు క్రాసింగ్స్

● స్టాపర్లు ఏర్పాటు చేయాలని స్థానికుల వేడుకోలు

జాతీయ రహదారిపై డివైడర్ తొలగించిన ప్రాంతం

చిట్యాల, ఫిబ్రవరి 26 : జాతీయ రహదారిని దాటేందుకు దారి తెరిచిన హైవే అధికారులు ఎలాంటి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయక పోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చిట్యాల పట్టణంలో ఫ్లైఓవర్ నిర్మాణం కోసం మూడు నెలల క్రితం సర్వీసు రోడ్లపై అదనపు నిర్మాణాలను కూల్చివేశారు. ఎస్‌బీఐకి ఎదురుగా, పాల శీతలీకరణ కేంద్రం సమీపంలో జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను తొలగించారు. దాంతో పాటు జాతీయ రహదారికి సర్వీసు రోడ్డుకు మధ్యలో ఉన్న గ్రిల్స్‌ను తొలగించి వాహనాలు నేరుగా జాతీయ రహదారిపై నుంచి సర్వీసు రోడ్డుకు వచ్చేలా, జాతీయ రహదారిపై వాహనాలు ఒక వైపు నుంచి మరో వైపునకు మళ్లేలా క్రాసింగ్ ఏర్పాటు చేశారు. కానీ ఆ ప్రాంతంలో క్రాసింగ్ ఉన్నట్లు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దాంతో జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్లపై ఉన్న వాహన దారులు అవతలి వైపు నుంచి ఇవతలి వైపునకు వెళ్తున్నారు. దాంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దాంతో అధికారులు రోడ్డును క్రాస్ చేయకుండా డివైడర్ తొలగించిన ప్రాంతంలో రేకులతో తాత్కాలిక రక్షణ గోడ ఏర్పాటు చేశారు. ఈ రేకులను స్థానికులు తొలగించి మరీ దాటుతుండడంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదానికి గురవుతున్నారు.

కనిపించని స్టాపర్లు

పట్టణంలోని పోలీస్ స్టేషన్ చౌరస్తాతో పాటు బస్టాండ్, రైల్వే స్టేషన్ క్రాసింగ్, వట్టిమర్తి స్టేజీ వద్ద గతంలో స్టాపర్లు ఉండేవి. దాంతో రోడ్డు దాటే ప్రయాణికులకు ఇబ్బంది ఉండేది కాదు. కానీ ఇటీవల స్టాపర్లను తొలగించారు. దాంతో రోడ్డు దాటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్టాపర్లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్ హైఓల్టేజీతో సామగ్రి దగ్ధం

నిడమనూరు, ఫిబ్రవరి 26 : మండల కేంద్రంలో బుధవారం రాత్రి హైఓల్టేజీతో పలు ఇండ్లల్లోని విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. బొడ్రాయి బజార్‌లోని 160 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ న్యూట్రల్ బుష్‌రాడ్ విరిగి పోవడంతో రాత్రి 9.30 గంటల సమయంలో ఇండ్లకు హై ఓల్టేజీ విద్యుత్ సరఫరా అయ్యింది. దాంతో ఇండ్లలోని టీవీలు, రిఫ్రిజిరేటర్లు, స్టెబిలైజర్లు కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న విద్యుత్ సిబ్బందికి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. విద్యుత్ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఏర్పడిన లోపాన్ని సవరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

భక్తి శ్రద్ధలతో మహా శివరాత్రి వేడుకలు

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు
పూజలు నిర్వహించిన ప్రముఖులు

రామగిరి, ఫిబ్రవరి 26: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పానగల్ ఛాయా, పచ్చల సోమేశ్వర ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెల్లవారుజామునే పానగల్ ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, డీఎస్పీ శివరాంరెడ్డి, పట్టణ ప్రముఖులు, అధికారులు పానగల్ ఆలయాల్లో పూజలు చేశారు. అన్ని దేవాలయాల్లో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. రాత్రి జాగరణ చేశారు. కట్టంగూర్, చిట్యాలలోని శివాంజనేయ ఆలయాల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం, నిడమనూరు మండలం వెంగన్నగూడెం,అనుముల మండలం పేరూరు శివాలయంలో ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. తిరుమలగిరి(సాగర్) మండలం రంగుండ్లతండా శివాలయాన్ని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి దర్శించుకొన్నారు. శాలిగౌరారం మండలం చిత్తలూర్ గ్రామంలోని శంభులింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరయ్యారు. తిప్పర్తి మండలం రామలింగాలగూడెం మార్కండేశ్వరాలయంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పూజలు చేశారు.

అభిషేకం చేస్తున్న ఐఏఎస్ అధికారులు ఇలా త్రిపాఠి, స్మితాసబర్వాల్, ప్రియాంక వర్గీస్

దామరచర్ల మండలం వాడపల్లిలో కృష్ణా మూసీ సంగమంలో భక్తులు పుణ్యస్నానాలు చేశారు. ఎమ్మెల్యే బత్తుల లక్మారెడ్డి పూజలు నిర్వహించారు.

చందంపేట మండలం దేవరచర్ల శివాలయం భక్తులతో కిటకిటలాడింది. హేమాసొకార్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు భక్తులకు తాగునీరు, ఆహారం అందించారు.

నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులోని పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. నక్కలపల్లిలో జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి పూజలు చేశారు.

పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నార్కట్‌పల్లి : నక్కలపల్లిలో పూజలు చేస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్

నల్లగొండలోని అన్వేశ్వరమ్మ గుట్టపై శివుడికి అభిషేకం చేస్తున్న భక్తులు